గోల్డ్ @ 85,300

దేశీయంగా ఆల్‌టైమ్ హైకి బంగారం ధర

మరో రూ.400 పెరిగిన తులం రేటు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: బంగారం ధరలు మళ్లీ పరుగులు తీస్తున్నాయి. ఆ మధ్య విరామం ఇచ్చిన రేట్లు.. తిరిగి పెరుగుతూపోతున్నాయి. ఈ క్రమంలోనే సోమవారం ఆల్‌టైమ్ హై రికార్డును నెలకొల్పాయి. మునుపెన్నడూ లేనివిధంగా దేశీయ మార్కెట్‌లో తులం ధర ఏకంగా రూ.85వేల మార్కును దాటేసింది. ఢిల్లీలో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల విలువ రూ.85,300 పలికింది మరి. ఒక్కరోజే రూ.400 ఎగిసినట్టు అఖిల భారత సరఫా సంఘం తెలియజేసింది.

ఇదీ సంగతి..

పుత్తడి ధరలు ఈ స్థాయిలో రికార్డులకెక్కడం వెనుక.. నగల వ్యాపారులు, స్టాకిహోల్డర్ల నుంచి పెరిగిన డిమాండ్, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనం, అంతర్జాతీయ మార్కెట్ల ట్రెండే ప్రధాన కారణాలని ట్రేడర్లు విశ్లేషిస్తున్నారు. ఇకపోతే స్టాక్ మార్కెట్లు నష్టాల్లో కదలాడుతుండటంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షిత పెట్టుబడి సాధనమైన పసిడి వైపునకు మళ్లిస్తున్నారని, అందుకే ఈ ధరల పెరుగుదల అంటూ తాజా మార్కెట్ సరళిని నిపుణులు అంచనా వేస్తున్నారు. మున్ముందూ పరిస్థితులు ఇలాగే ఉంటాయన్న అంచనాల మధ్య ధరలు కొత్త రికార్డుల్నే సృష్టించే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి.

హైదరాబాద్‌లో..

హైదరాబాద్‌లో బంగారం ధరల విషయానికొస్తే.. 24 క్యారెట్ తులం విలువ రూ.84,050గా ఉన్నది. గతంతో పోల్చితే రూ.440 తగ్గడం గమనార్హం. ఇక 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత లేదా ఆభరణాల బంగారం) 10 గ్రాముల రేటు రూ.77,050గా ఉన్నది. రూ.400 పడిపోయింది. ఇదిలావుంటే ఢిల్లీలో వెండి ధర కిలో రూ.300 పెరిగి రూ.96,000గా ఉన్నది. వరుసగా ఐదోరోజు ధరలు పెరగడం విశేషం. అయితే ధరలు పెరుగుతూపోతే మార్కెట్‌లో స్తబ్ధత నెలకొంటుందని, కస్టమర్లు వేచిచూసే ధోరణిని అవలంభిస్తారని ఆభరణాల వర్తకులు వాపోతున్నారు. దీనివల్ల వ్యాపారం దెబ్బతింటుందని చెప్తున్నారు. నిజానికి ధరలు స్థిరంగా ఉన్నప్పుడే కొనుగోళ్లు బాగా జరుగుతాయని వారు అంటున్నారు.

గ్లోబల్ మార్కెట్‌లో..

అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ 2,827.50 డాలర్లుగా నమోదైంది. క్రితంతో పోల్చితే 7.50 డాలర్లు పెరిగింది. ఔన్స్ సిల్వర్ 32.10 డాలర్లు పలికింది. ఇక భారతీయ ఫ్యూచర్ మార్కెట్లలో బంగారం ఏప్రిల్ నెల కాంట్రాక్టులకుగాను తులం రూ.82,765గా ట్రేడ్ అయ్యింది. మార్చి నెలకుగాను వెండి కిలో రూ.93,650గా పోయింది. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 319.22 పాయింట్ల నష్టంతో 77,186.74 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 121.10 పాయింట్లు కోల్పోయి 23,361.05 వద్ద స్థిరపడింది. దీంతో మదుపరులు లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. బీఎస్‌ఈలో లిస్టైన సంస్థల విలువ రూ.4,29,823.69 కోట్లు కోల్పోయి రూ.4,19,54,829.60 కోట్లు(4.82 ట్రిలియన్ డాలర్లు)కు పడిపోయింది. ఎల్‌అండ్‌టీ, టాటా మోటర్స్, హెచ్‌యూఎల్, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, రిలయన్స్ షేర్లు అత్యధికంగా నష్టపోగా..బజాజ్ ఫైనాన్స్ 5 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, మారుతి షేర్లు కూడా లాభాల్లో ముగిశాయి.

ఏఐ వర్సిటీతో పెరగనున్న రాష్ట్ర ప్రతిష్ఠ

మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఫిబ్రవరి 3(నమస్తేతెలంగాణ): ఏఐ యూనివర్సిటీ ఏర్పాటుతో రాష్ట్ర ప్రతిష్ఠ మరింత పెరగనున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో డిపాజిటరీ ట్రస్ట్ క్లియరింగ్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..ఎమర్జింగ్ టెక్నాలజీలో పెట్టుబడులు పెట్టాలనుకొనే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని, రాబోయే రోజుల్లో ఏఐ అంటే తెలంగాణ, హైదరాబాద్ గుర్తుకువచ్చేలా యూనివర్సిటీని తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

రూపీ మహా పతనం

మార్కెట్‌లో వాణిజ్య యుద్ధం భయాలు • ఆల్‌టైమ్ కనిష్ఠానికి మారకం విలువ

తొలిసారి 87 మార్కు దిగువకు క్షీణత • మరో 49 పైసలు దిగజారి 87.11 వద్దకు

ముంబై, ఫిబ్రవరి 3: డాలర్ ముందు రూపాయి తేలిపోతున్నది.. ఏమాత్రం నిలువలేక చతికిలపడుతున్నది.. అంతకంతకూ బలహీనపడిపోతున్నది. గతకొద్ది రోజులుగా ఫారెక్స్ మార్కెట్‌లో భారతీయ కరెన్సీ ట్రేడింగ్ తీరుతెన్నులను వివరించే క్రమంలో వాడుతున్న వాక్య నిర్మాణాలివి. అవును.. రూపీ కష్టాలు అన్నీ ఇన్నీ కావు మరి. అయితే వరుస పతనాల్లో కొట్టుమిట్టాడుతున్న రూపాయికి.. ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రూపంలో కొత్త సమస్యలు వచ్చినట్టే కనిపిస్తున్నది. ఇవి ఇలాగే సాగితే రూపీ సెంచరీ కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని నిస్సందేహంగా చెప్పవచ్చు. సోమవారం మరో 49 పైసలు దిగజారి డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ తొలిసారి 87 మార్కును దాటేసింది. మునుపెన్నడూ లేనివిధంగా 87.11 వద్ద ముగిసి మరో ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని నమోదు చేసింది. కెనడా, మెక్సికో, చైనాలపై ట్రంప్ సర్కారు విధించిన సుంకాలే దీనికి ప్రధాన కారణం.

ట్రంప్ దెబ్బ

కెనడా, మెక్సికోలపై 25 శాతం చొప్పున సుంకాలు బాదిన అగ్రరాజ్య అధ్యక్షుడు.. చైనాపై 10 శాతం విధించారు. ఈ నిర్ణయం అమెరికా డాలర్ ఇండెక్స్‌ను ఒక్కసారిగా ఎగదోసింది. 109 స్థాయి ఎగువకు డాలర్ సూచీ వెళ్లింది. ఈ దెబ్బకు రూపాయి కూడా ఒకానొక దశలో 67 పైసలు క్షీణించి 87.29 స్థాయికి పడిపోవడం గమనార్హం. తిరిగి మళ్లీ కోలుకున్నా.. నష్ట తీవ్రత మాత్రం పెద్దగానే జరిగింది. ఆయా దేశాలపై సుంకాలు వాణిజ్య యుద్ధానికి దారితీయవచ్చన్న భయాలు ఫారెక్స్ మార్కెట్‌ను చుట్టుముట్టాయి. దీంతో దేశీయ దిగుమతిదారులు డాలర్ కొనుగోళ్లకు పెద్దపీట వేశారని ట్రేడర్లు చెప్తున్నారు. ఇక విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) తమ పెట్టుబడులను భారత మార్కెట్ల నుంచి వెనక్కి తీసుకుంటుండటం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను మరింతగా బలహీనపరుస్తున్నది. మరో రూ.3,958.37 కోట్లు ఉపసంహరించుకున్నారు. దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలూ రూపీ ఉసురుతీశాయి.



భయపడొద్దు.. ఆర్బీఐ ఉందిలే: పాండే

రూపాయి రికార్డు నష్టం నేపథ్యంలో విలేకరుల వద్ద కేంద్ర ఆర్థిక కార్యదర్శి తుహిన్ కాంత పాండే స్పందిస్తూ.. 'భయం అక్కర్లేదు ఈ ఒడిదొడుకులను ఆర్బీఐ చూసుకుంటుందిలే' అన్నారు. అలాగే భారతీయ కరెన్సీ స్వేచ్ఛగా ట్రేడ్ అవుతుందని, దాన్ని అదుపు చేయడం లేదా ఒక స్థిరమైన రేటును నిర్ణయించడం అనేది ఉండబోవని కూడా చెప్పారు. దేశీయ క్యాపిటల్ మార్కెట్ల నుంచి తరలిపోతున్న విదేశీ పెట్టుబడుల నడుమ రూపాయి మారకం విలువ ఒత్తిళ్లకు గురువుతుందన్న ఆయన.. ఈ ఒడిదొడుకులను ఆర్బీఐ సరిచేస్తుందన్న ధీమాను కనబర్చారు. ఇక డిసెంబర్ 31న 85.61 వద్ద ముగిసిన రూపీ విలువ.. ఇప్పుడు 87.11 వద్దకు చేరింది. కేవలం గడిచిన నెల రోజుల్లోనే రూపాయిన్నర క్షీణించింది.

ఈసారి వడ్డీరేట్లు తగ్గుతాయ్!

రెపో రేటు పావు శాతం దిగిరావచ్చు • ఆర్బీఐ ద్రవ్యసమీక్షపై నిపుణుల అంచనా

ముంబై, ఫిబ్రవరి 3: త్వరలో వడ్డీరేట్లు పావు శాతం తగ్గుతాయన్న అంచనాలు వినిపిస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష బుధవారం మొదలు కానుండగా.. శుక్రవారం ఫలితం తేలనున్నది. ఈ క్రమంలోనే రెపో రేటును ఈసారి ఆర్బీఐ 25 బేసిస్ పాయింట్లు తగ్గించే వీలున్నదని ఆర్థిక, బ్యాంకింగ్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇటీవలి బడ్జెట్ నిర్ణయాలకు ఊతమివ్వడంలో భాగంగా రెండేండ్ల తర్వాత రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల కోతకు దిగవచ్చన్న విశ్లేషణలు వస్తున్నాయి మరి.



బడ్జెట్‌కు ఊతం..

వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఈ నెల 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కొత్త ఆదాయ పన్ను (ఐటీ) విధానం కింద రూ.12 లక్షలదాకా వార్షిక ఆదాయం ఉన్నవారు ఎలాంటి పన్నులు చెల్లించనవసరం లేదని పేర్కొన్న సంగతీ విదితమే. స్టాండర్డ్ డిడక్షన్ రూ.75వేలతో కలిపి రూ.12.75 లక్షలదాకా ఐటీ మినహాయింపు లభిస్తున్నది. మార్కెట్‌లో తగ్గిన కొనుగోలు, వినిమయ శక్తిని పెంచేందుకు తమ నిర్ణయం కలిసొస్తుందన్న ఆశాభావాన్నీ మంత్రి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఈసారి ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ కూడా తన వంతుగా కీలక వడ్డీరేట్లను పావు శాతం మేర తగ్గించవచ్చని మెజారిటీ నిపుణులు అంటున్నారు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ రికార్డు కనిష్ఠాలకు పడిపోతున్న వేళ, దేశ జీడీపీ వృద్ధిరేటు మందగమనం దిశగా అడుగులు వేస్తున్న క్రమంలో వడ్డీరేట్ల తగ్గింపు మేలు చేయగలదన్న విశ్వాసాన్ని వారు కనబరుస్తున్నారు.

రెండేండ్ల తర్వాత..

2023 ఫిబ్రవరిలో రెపో రేటును 6.5 శాతానికి పెంచిన ఆర్బీఐ.. మళ్లీ ఆ తర్వాత దాని జోలికి వెళ్లనే లేదు. ద్రవ్యోల్బణం కట్టడి లక్ష్యంలో భాగంగా వడ్డీరేట్లను గరిష్ఠ స్థాయిల్లోనే కొనసాగిస్తున్నది. దీంతో గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణాలపై అధిక వడ్డీరేట్లనే బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు అనుసరిస్తున్నాయి. ఫలితంగా ఆయా రుణగ్రహీతలు, వివిధ వ్యాపార రంగాలు ప్రభావితమవుతున్నాయి. ఆర్బీఐ వడ్డీరేట్లను తగ్గిస్తే రియల్టీ, ఆటోతో పాటు పలు రంగాల్లో తిరిగి అమ్మకాలు పుంజుకుంటాయని వ్యాపార, పారిశ్రామిక వర్గాలు ఆశిస్తున్నాయి. నిజానికి కరోనాతో దిగాలుపడిన దేశ ఆర్థిక వ్యవస్థలో ఉత్తేజం నింపేందుకు ఆర్బీఐ వడ్డీరేట్లను భారీగా తగ్గించింది. అయితే ఆ తర్వాత విజృంభించిన ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయాలని వరుసగా పెంచుకుంటూపోయింది. ఈ క్రమంలో గత ద్రవ్యసమీక్షలో ఆర్బీఐ తన ద్రవ్యవైఖరిని మార్చుకున్నది. రాబోయే ద్రవ్యసమీక్షల్లో వడ్డీరేట్లు తగ్గుతాయని అప్పటి ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సంకేతాలు కూడా ఇచ్చారు. మరి కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఏం నిర్ణయం తీసుకుంటారో చూడాలి. మల్హోత్రా నాయకత్వంలో ఇదే తొలి ఆర్బీఐ ద్రవ్యసమీక్ష కావడం గమనార్హం.

గెలాక్సీ ఎస్25 అమ్మకాలు షురూ

హైదరాబాద్, ఫిబ్రవరి 3: సామ్‌సంగ్ ఇటీవల మార్కెట్లోకి విడుదల చేసిన ఎస్25 ఫోన్ల విక్రయాలను రాష్ట్రంలో ప్రారంభించింది. హైదరాబాద్‌లోని మాస్టర్ టెలికమ్యూనికేషన్స్ స్టోర్‌లో ముందస్తు బుకింగ్ చేసుకున్న వారికి అందచేశారు. ఈ కార్యక్రమంలో సామ్‌సంగ్ ప్రతినిధులు ఎసికే నాగర్‌మాలా, రాజశేఖర్, సుధీర్ కుమార్‌తోపాటు మాస్టర్ టెలికమ్యూనికేషన్స్ యజమాని సమీర్ మహ్మద్ కలిసి కస్టమర్‌కు తొలి ఫోన్లను అందచేశారు. మూడు రకాల్లో లభించనున్న ఈ ఫోన్ రూ.80,999 నుంచి రూ.1.29 లక్షల ధరల శ్రేణిలో లభించనున్నాయి. వీటిలో ఎస్25 బేసిక్ మాడల్ 12జీబీ+128 జీబీ, 12జీబీ+256జీబీ, 12జీబీ+512జీబీ ప్రారంభ ధర రూ.80,999గాను, ఎస్25+ మాడల్ ప్రారంభ ధర రూ.99,999, అలాగే ఎస్25 అల్ట్రా మాడల్ 12జీబీ+256 జీబీ, 12జీబీ+51జీబీ, 12జీబీ+1టీబీ మాడల్ ధర రూ.1,29,999కి విక్రయించనున్నది.

భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

ముంబై, ఫిబ్రవరి 3: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్‌పడింది. అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ మరోసారి టారిఫ్ యుద్ధానికి తెరలేపడంతో అంతర్జాతీయ మార్కెట్లు ఒక్కసారిగా కుదుపునకు లోనయ్యాయి. దీంతో వరుసగా ఐదు రోజులుగా లాభపడుతున్న సూచీలు భారీగా నష్టపోయాయి. ఇంట్రాడేలో ఏకంగా 1,100 పాయింట్లకుపైగా కుప్పకూలిన సెన్సెక్స్ చివరకు 952.51 పాయింట్ల నష్టంతో 76,353.45 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 277.55 పాయింట్లు కోల్పోయి 23,204.60 వద్ద ముగిసింది. ఒక్కరోజులో ఇన్వెస్టర్ల సంపద రూ.7.5 లక్షల కోట్లు ఆవిరైంది. బీఎస్‌ఈలో లిస్టైన సంస్థల విలువ రూ.4,19,54,829.60 కోట్లు(4.82 ట్రిలియన్ డాలర్లు)కు పడిపోయింది. ఎల్‌అండ్‌టీ, టాటా మోటర్స్, హెచ్‌యూఎల్, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, రిలయన్స్ షేర్లు అత్యధికంగా నష్టపోగా..బజాజ్ ఫైనాన్స్ 5 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, మారుతి షేర్లు కూడా లాభాల్లో ముగిశాయి.

గ్లాండ్‌ఫార్మా లాభం 205 కోట్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 3: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఫార్మా దిగ్గజం గ్లాండ్ ఫార్మా ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.205 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.192 కోట్ల కంటే ఇది 7 శాతం అధికమని పేర్కొంది. కంపెనీ ఆదాయం రూ.1,384 కోట్ల నుంచి రూ.1,545 కోట్లకు ఎగబాకింది.

మాట్లాడుతున్న సీపీఐ నాయకులు కట్టెబోయిన శ్రీనివాస్

శ్రీరాంసాగర్ కాల్వ నీటిని పాకాల ఏరుకు మళ్లించాలి

గార్ల, ఫిబ్రవరి 3 : వేసవి కాలంలో శ్రీరాంసాగర్ కాల్వ నీటిని పాకాల ఏరుకు మళ్లించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి రాకముందే పాకాల ఏరులో నీరు మొత్తం ఇంకిపోయిందని, యాసంగి సాగు చేస్తున్న రైతులకు చుక్క నీరు లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకన్న, నరసింహారావు, రమేశ్ పాల్గొన్నారు.

శ్రీను కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

స్నేహితుడి వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

డోర్నకల్, ఫిబ్రవరి 3 : పట్టణానికి చెందిన రెడ్డబోయిన శ్రీను బ్రెయిన్ స్ట్రోక్‌తో హైదరాబాద్ ఏఐజీ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఆయన స్నేహితులు వాట్సాప్ గ్రూప్‌ను వేదికగా చేసుకుని దాతల నుంచి రూ.1,10,000 సేకరించి ఆసుపత్రి వద్ద శ్రీను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు మామిడి నాగరాజు, సాధనాల రాము, సుర మధు, మామిడి సాంబ, పాల్గొన్నారు.

మొగిలిచర్లలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

కుష్ఠు వ్యాధిపై అవగాహన ర్యాలీ

కురవి, ఫిబ్రవరి 3: మండలంలోని బలపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మొగిలిచర్ల సబ్ సెంటర్‌లో సోమవారం స్పర్శ లెప్రసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎల్లయ్య మాట్లాడుతూ... పాలిపోయిన ఎరుపురంగు మచ్చలు, మొద్దుబారిన మచ్చలు, నరాల్లో బలం తగ్గిపోవడం వంటి లక్షణాలు కనిపించన వెంటనే దగ్గరలోని ప్రభుత్వ వైద్యశాలలను సంప్రదించాలని కోరారు. చర్మ వ్యాధులకు ఉచిత మందులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సీహెచ్ శోభ, హెల్త్ అసిస్టెంట్ జెట్టి అరునాదేవి, ఆశ కార్యకర్తలు కృష్ణవేణి, పూరి, కవిత పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలని విద్యార్థుల ధర్నా

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 3 : నీటి సమస్యను పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని పట్టణంలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కాలేజీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కళాశాల నుంచి మూడుకొట్ల సెంటర్ వరకు ర్యాలీగా రోడ్డుపైకి వచ్చారు. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ సంఘాలలతో కలిసి రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు బోన గిరి మధు, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మురళీనాయక్ క్యాంపు కార్యాలయానికి ఇంజినీరింగ్ కళాశాల కూతవేటు దూరంలో ఉన్నా, విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రజాపాలనలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు అందడం లేదని, రాష్ట్రంలో విద్యావ్యవస్థ గాడి తప్పిందన్నారు. కళాశాల హాస్టల్‌లో లేడీస్ వర్కర్లు లేక విద్యార్థినులు జెన్స్ వర్కర్లతో తమ సమస్యలను చెప్పుకోవడానికి ఇబ్బందిపడుతున్నారని, క్లర్క్ తమ సమస్యలను చెబితే బెదిరింపులకు గురిచేస్తున్నాడని, వెంటనే అధికారులు స్పందించి కళాశాల సమస్యలపై విచారణ చేయించాడలని డిమాండ్ చేశారు. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ ఇరిగేషన్ ఏఈతో మాట్లాడి నీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నాను విరమించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టణంలోని ఇంజినీరింగ్ కళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

దేవరుప్పుల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల నాయకుల సమక్షంలో పాలకుర్తి శాసనసభ్యులు శ్రీమతి యశస్వినీ రెడ్డి గారి జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు..

వైరల్ అవుతున్న ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి అనే పోస్ట్..

పాలకుర్తి ఎమ్మెల్యే ఎవరు?

యశస్వినీరెడ్డి పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టు

తొర్రూరు, ఫిబ్రవరి 3 : పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం నిర్వహించారు. అయితే, సోషల్ మీడియాలో పలువురు యూజర్లు, నాయకులు పాలకుర్తి శాసనసభ్యురాలిగా యశస్వినీరెడ్డి పేరును ప్రస్తావిస్తూ ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రస్తుతం పాలకుర్తి ఎమ్మెల్యేగా యశస్వినీరెడ్డి ఉన్నప్పటికీ ఆమె అఫీషియల్ ఐడీతో సోషల్ మీడియాలో మరోపేరుతో శుభాకాంక్షలు వైరల్ కావడం చర్చనీయంశంగా మారింది.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

డోర్నకల్, ఫిబ్రవరి 3 : డోర్నకల్ మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న వడ్డిపల్లి రమేశ్ బాపట్ల జిల్లా గాజుల్లంక (పోస్టు) పేపర్లంకకు చెందిన శ్రీవిద్యను సోమవారం మర్రిగూడెం వేటవేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొంతకాలంగా వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. రమేశ్ స్వస్థలం కరీంనగర్ జిల్లా. ఇద్దరు ఇష్టపూర్వకంగా పెండ్లి చేసుకున్నట్లు డోర్నకల్ పోలీసుస్టేషన్‌లో సీఐ రాజేశ్‌కు ఫిర్యాదు చేశారు.

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న ప్రేమ జంట

క్రీడలతోనే స్నేహభావం పెంపొందించుకోవాలి

గార్ల, ఫిబ్రవరి 3: క్రీడలతో స్నేహభావాన్ని పెంపొందించుకోవాలని ఎస్సై రియాజ్‌పాషా అన్నారు. సోమవారం మండలంలోని సీతంపేట గ్రామంలో సమ్మక్క, సారక్క జాతర సందర్భంగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను దాతలు ఊరుగొండ శ్రీనివాస్, భూక్యా భద్రూస్వామి, మాలోత్ హనుమంతు, నరేశ్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ స్థాయిలో క్రీడలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీశక్తి అవార్డు గ్రహీత శంషాద్ బేగం, ఎంఈవో వీరభద్రా రావు, సీనియర్ ఉపాధ్యాయులు మాలోత్ శివనాయక్, మాజీ సర్పంచ్ బానోత్ లావణ్యాశ్రీనివాస్, గండు శ్రీను, నరసింహారావు, మాలోత్ రామారావు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై రియాజ్ పాషా

బీసీ కులగణన నివేదికను ప్రభుత్వ విడుదల చేసిన నేపథ్యంలో దానిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నివేదిక తప్పుల తడకగా ఉందని, బీసీలకు ప్రభుత్వ అన్యాయం చేస్తోందని పలువురు విమర్శిస్తున్నారు.

కుల గణన పేరుతో కాలయాపన

డోర్నకల్ : కుల గణన పేరుతో ప్రభుత్వ కాలయాపన చేస్తున్నది. ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో పేద ప్రజలకు మొండిచేయి చూపింది. ప్రజాపాలన పేరుతో అనర్హులకే సంక్షేమ పథకాలు అందుతున్నాయి. రిజర్వేషన్ల ప్రక్రియ అంటూ గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించలేదు. గ్రామ పంచాయతీల పాలన అస్తవ్యస్తంగా మారింది.

– కాడెం బాబు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు

బీసీలకు అన్యాయం చేసేలా సర్వే

నర్సింహులపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీసీ కులగణన తప్పుడు నివేదికగా ఉంది. ఎన్నికల కోసమే దీనిని ప్రకటించారు. గ్రామాల్లో ఇండ్లకు స్టిక్కర్లు వేసినప్పటికీ కొన్నింటిని సర్వే చేయలేదు. గ్రామీణ ప్రాంతంలో ఎక్కువ మంది బీసీలు ఉన్నప్పటికీ వారు వివిధ ప్రాంతాలకు పనుల కోసం వెళ్లడంతో వారి పేర్లు నమోదు కాలేదు. అందుబాటులో ఉన్న వారి వివరాలు మాత్రమే నమోదు చేశారు. దీంతో బీసీలకు అన్యాయం జరిగింది. తాళం వేసి ఉన్న ఇండ్ల పక్కనున్న వారు చెప్పిన వివరాలను మాత్రమే సర్వేలో నమోదు చేశారు.

– బండి రమేశ్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు, నర్సింహులపేట,

డోర్నకల్ మున్సిపల్ కమిషనర్‌గా ఉదయ్ కుమార్

డోర్నకల్, ఫిబ్రవరి 3 : డోర్నకల్ మున్సిపల్ కమిషనర్‌గా ఉదయ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన కమిషనర్ వెంకట స్వామి రామగుండం మున్సిపాలిటీకి బదిలీ కాగా, ఖమ్మం మున్సిపాలిటీలో పని చేసిన ఉదయ్‌కుమార్ ఇక్కడికి వచ్చారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఉదయ్‌కుమార్ తెలిపారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

మరిపెడ, ఫిబ్రవరి 3 : 2025 -26 కేంద్ర బడ్జెట్‌లో పేదలు, రైతులు, అసంఘటితరంగ కార్మికులు, విద్య,వైద్య రంగాలకు తీవ్ర నష్టం జరిగిందని ఆరోపిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం గాంధీ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి మధుసూదన్ మాట్లాడుతూ.. కేంద్రబడ్జెట్‌లో పేదల ప్రజల ఆహార భద్రత, విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు తగ్గాయన్నారు. ఈ కార్యక్రమంలో మరిపెడ మండల నాయకులు బోడపట్ల రాజశేఖర్, కందాల రమేశ్, దొంతు మమత, కొండ ఉప్పలయ్య, దొ